భూసార పరీక్షలేవి?

- అందుబాటులో లేని కిట్లు
- ఇష్టానుసారంగా ఎరువుల వినియోగం
- నిస్సారమవుతున్న నేల
- పరీక్షలు నిర్వహిస్తేనే మేలు

గంభీరావుపేట: మండలంలో ఆరేళ్లుగా రైతుల పంటపొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించడం లేదు. పంటల సాగుకు ముందు భూసార పరీక్షలు నిర్వహించక, నేలలోని పోషక విలువల స్థితిగతుల గురించి తెలియక రైతులు అవగాహన లేమితో ఇష్టానుసారంగా రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారు. ఫలితంగా నేల నిస్సారమవుతోంది.

కానరాని కిట్లు

ఆరేళ్ల క్రితం గత ప్రభుత్వం రూ.లక్షలాది రూపాయలతో సామగ్రిని కొనుగోలు చేసి క్లస్టర్లవారీగా వ్యవసాయశాఖ అధికారులకు భూసార కిట్లను పంపిణీ చేసింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం రైతు వేదికల్లోనూ కిట్లు కానరావడం లేదు. పనిచేయకపోవడం, రసాయనాలు లేకపోవడంతో వాటిని జిల్లా కార్యాలయానికి అందించి ఉండవచ్చని ప్రస్తుతం అధికారులు చెబుతున్నారు.

అవగాహన సదస్సులకే పరిమితం

వ్యవసాయశాఖ అధికారులు భూసార పరీక్షలు, రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం గురించి రైతు వేదికల్లో ప్రత్యేక సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఏయే విత్తనాలు ఎంపిక చేసుకోవాలో వివరిస్తున్నారు. కానీ వేసవిలో భూసార పరీక్షలు నిర్వహించి ఎరువులు ఏయే మోతాదులో వేయాలో అవగామన కల్పిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. కిట్లు, రసాయనాలు లేక, శిక్షకులు లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది.



భూసార పరీక్ష చేయకుండానే సాగు పనులు మొదలుపెట్టిన రైతు

అయోమయంలో రైతులు

రైతులు సాగుపనులు మొదలుపెట్టే సమయంలో నేల స్వభావం తెలియాలి. నేలలో ఏ పంటలు పండిస్తే దిగుబడి ఎక్కువగా వస్తుంది. ఎంత మోతాదులో ఎరువులు వినియోగించాలో తెలియక తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి భూసార పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

భూసార పరీక్షలు చేయాలి



ప్రభుత్వం భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు ఎరువుల వాడకం, ఏ పంటలు వేసుకోవాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అప్పుడే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మా భూమిలో ఏ పోషకాలు ఉన్నాయో.. ఏ ఎరువులు వాడాలో ఏ అధికారి తెలపలేదు. వ్యవసాయశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

– వెంకటి యాదవ్, రైతు, గంభీరావుపేట

ఆదేశాలు రాలేదు



భూసార నమూనాలు సేకరించాలని, పరీక్షలు నిర్వహించాలని ఇంకా ఆదేశాలు రాలేదు. గతంలో నమూనాల సేకరణకు పరికరాలు, కిట్లు పంపిణీ చేశారు. గంభీరావుపేట మండలానికి మూడు కిట్లు వచ్చాయి. కానీ రసాయనాలు లేక కిట్లను జిల్లా కార్యాలయానికి పంపించడం జరిగింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– వెంకటేశ్, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

మిమిక్రీలో ప్రశంసాపత్రం



నిర్వాహకుల నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అక్కపెల్లి యాదగిరిగౌడ్

సిరిసిల్లకల్చరల్: మండలంలోని ఎన్గల్ స్కూల్‌లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు అక్కపెల్లి యాదగిరిగౌడ్ తన మిమిక్రీలో మరో గుర్తింపు అందుకున్నారు. ఉమ్మడి కరీంనగర్‌లోని ఫిల్మ్‌భవన్‌లో అంజలి మీడియా ఫౌండేషన్ సారథ్యంలో గురువారం వివిధ కళాంశాల్లో టాలెంట్ షో నిర్వహించారు. ధ్వన్యనుకరణ విభాగంలో యాదగిరి ప్రదర్శన ఆకట్టుకుంది. ఫౌండేషన్ చైర్మన్ కామిశెట్టి రాజు చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

తంగళ్లపల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ జనగామ శరత్ రావు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, గ్రామపంచాయతీల స్పెషల్ అధికారులు హాజరుకావాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ ఆటో యూనియన్ కార్యవర్గం ఎన్నికను గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కొండ శంకరయ్య, గౌరవాధ్యక్షుడిగా కట్ట రమేశ్, ఉపాధ్యక్షుడిగా దయ్యాల ప్రభాకర్, కోశాధికారిగా గుడి శేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



జేమ్స్‌ను సన్మానిస్తున్న మనోహర్‌రెడ్డి

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి వార్డుకు చెందిన గుడిసె జేమ్స్ నీట్ ఫలితాల్లో ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. దీంతో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి గురువారం ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాస్, పర్శ రాములు, మనోజ్‌కుమార్, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తంగళ్లపల్లి: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారయణ జన్మదినం సందర్భంగా గురువారం ఇల్లంతకుంట మండలకేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈనెల 10న ఎమ్మెల్యే జన్మదినం నిర్వహించనుండగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపల్లి రాఘవ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నెలరోజులుగా పొలంలోనే..



కోనరావుపేట: మండలంలోని మరిమడ్లలో విద్యుత్ స్తంభం కూలి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరిమడ్ల శివారులోని బైరి మల్లేశం అనే రైతుకు సంబంధించిన వ్యవసాయ భూమిలో నెలరోజుల క్రితం ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం విరిగిపడింది. పొలంలో పడడంతో రైతు ఇబ్బంది పడుతున్నాడు. ప్రస్తుతం పొలం దున్నుకునేందుకు వీలులేకుండా ఉందని, సంబంధిత అధికారులు వెంటనే తొలగించాలని కోరుతున్నాడు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



గంభీరావుపేట: లింగన్నపేటలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట: మండలకేంద్రంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని లింగన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఇంటింటా తిరుగుతూ పాఠశాల ప్రత్యేకతలను వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలలోనే చేరాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. నోడల్ అధికారి సంటి గంగారాం, ఉపాధ్యాయులు శీలకుమార్, రాజేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రంలో గురువారం మండల నోడల్ అధికారి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులు, విద్యా బోధన గురించి తల్లిదండ్రులకు వివరించి ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు తరలించడమే లక్ష్యంగా బడిబాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యా అందుతుందన్నారు. ఉపాధ్యాయులు ప్రభా కర్ రెడ్డి, పద్మకల, బుచ్చిరెడ్డి, రవీందర్, యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, సత్యం, సీఆర్పీలు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎమ్మెల్యేను కలిసిన విజయ్‌రెడ్డి



ఎల్లారెడ్డిపేట: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గురువారం మండలంలోని కోరుట్లపేటకు చెందిన టీమ్ రేవంత్‌రెడ్డి అధ్యక్షుడు గూడ విజయ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను సన్మానించి ఫొటో ఫ్రేమ్ ను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని విజయ్‌రెడ్డి ఎమ్మెల్యేను కోరారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

'సహకరించని ప్రభుత్వాలు'

వేములవాడరూరల్: ప్రజలు ఓట్లేసే గెలిపిస్తే పదవుల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వాలు సహకరించడం లేదని, వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 4కు ఎంపీపీ పదవి ముగియనున్నది. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు మారినప్పటికీ ప్రత్యేక నిధులు కేటాయించడం లేదన్నారు. ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పినా వాటిని ఆచరణలో చూపడం లేదన్నారు. సర్పంచ్‌లకు వచ్చిన నిధులు కూడా ఎంపీటీసీలకు రావడం లేదని, దీంతో ఎంపీటీసీలు నిధులు లేక ఏం చేయలేకపోయామని ఆయన గుర్తు చేశారు. వచ్చిన కొద్దిపాటి నిధులతో గ్రామాల్లో కొన్ని పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకొని హామీలను కొంతమేర నెరవేర్చినట్లు ఆయన గుర్తు చేశారు. ముందస్తు పనులు చేసిన సర్పంచులు, ఎంపీటీసీలకు ఇంకా బిల్లులు రావాల్సి ఉన్నా రావడం లేదని, దీంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

చందుర్తి: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. మండలంలోని మర్రిగడ్డ గ్రామంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంతపూరి బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ముగింపుకు గురువారం హాజరయ్యారు. విన్నర్‌గా నిలిచిన మల్యాల జట్టుకు రూ.5వేల నగదుతో పాటు షీల్డ్‌లను అందించారు. రన్నర్‌గా నిలిచిన మర్రిగడ్డ జట్టుకు రూ.2వేల నగదుతో పాటు షీల్డ్‌లు అందించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో 11 గ్రామాల జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల యువకులు క్రీడల్లో పాల్గొన్నాలన్నారు. జోగాపూర్ ఎంపీటీసీ సభ్యుడు మ్యాకల గణేశ్, సింగిల్ విండో డైరెక్టర్ నేవూరి శంకర్‌రెడ్డి, నాయకులు దారం హన్మంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం..



ఎల్లారెడ్డిపేటలో ఈదురు గాలులకు విరిగిపడిన చెట్టు



బోయినపల్లి: స్తంభంపల్లిలో మరమ్మతు చేస్తున్న సెస్ సిబ్బంది

- విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల)/బోయినపల్లి/వేములవాడ అర్బన్/ వేములవాడరూరల్/ రుద్రంగి: ఎల్లారెడ్డిపేట మండలంలో గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. మండలంలోని పలు గ్రామాల్లో చెట్లు, విద్యు త్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో సెస్ అధికా రులు కరెంట్ సరఫరాను నిలిపివేశారు. సుమా రు మూడు గంటలపాటు ఏకధాటిగా వర్షం పడడంతో రైతులు విత్తనాలు విత్తుకునేందుకు సిద్ధమవుతున్నారు. సెస్ అధికారులు విద్యుత్ సరఫ రాను పునరుద్ధరిస్తున్నారు. భారీగా ఈదురు గా లులు వీచడంతో ఇళ్లపై ఉన్నరేకులు లేచిపోయాయి.

తెగిపడిన విద్యుత్ తీగలు

బోయినపల్లి మండలం స్తంభంపల్లిలో ఈదురు గాలులతో కురిసిన వర్షానికి చెట్టు కొమ్మ విరిగి పడడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. గ్రామస్తులు స్పందించి సెస్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతోపాటు పనులకు సహకరించారు. వేములవాడ పట్టణంలో ఈదురుగాలులు, ఉరుములులతో కూడిన భారీ వర్షం కురిసింది. కట్టు కాలువ ప్రాంతంలో విద్యుత్ స్తంభంపై పిడుగు పడి విద్యుత్ లైన్ తెగిపోయింది. సెస్ అధికారులు వెళ్లి మరమ్మతు చేపట్టారు. రుద్రంగి మండలకేంద్రంలో భారీ వర్షం కురిసింది. మరో వైపు కొనుగోలు కేంద్రాల్లో యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తికాకపోవంతో ధాన్యం తడిసి ముద్దయింది. వేములవాడరూరల్ మండలంలోని శాత్రాజుపలి, వట్టెంల, నూకలమర్రి, ఫాజుల్‌నగర్, మర్రిపల్లి, నమిలిగుండపల్లిలో వర్షం కురిసింది. కొందరు రైతులు ఇప్పటికే విత్తనాలు విత్తుకొని ఉండగా మరికొందరు దుక్కులు సాగుచేసుకుంటున్నారు. ఇంతకుముందే విత్తనాలు విత్తుకున్న రైతులు ఈ వర్షంతో మొలకెత్తే అవకాశం ఉందని హర్షం వ్యకంచేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని నీలోజిపల్లి ఆర్అండ్ఆర్‌కాలనీ వద్ద కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన యువకుడు తిరుపతి తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి తన చేనులో పనులు ముగించుకొని కూరగాయలతో గ్రామానికి బైక్‌పై తిరిగి వస్తున్నాడు. నీలోజిపల్లి రోడ్డుపై హోటల్ పరిసరాల్లో ఓ లారీ ఆగి ఉంది. బైక్‌పై వస్తున్న తిరుపతి వెనక నుంచి లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.



గాయపడిన తిరుపతి

అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో ఎవరికి ఎన్ని ఓట్లు?

- ఖాతా తెరవని ఐదుగురు అభ్యర్థులు
- నాలుగు ఓట్లతో గెలిచిన అడ్డగట్ల మురళి
- 304 ఓట్ల మెజార్టీతో వేముల సుక్కమ్మ విజయం

సిరిసిల్ల: సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో చిత్ర విచిత్రాలు చోటు చేసుకున్నాయి. ఎన్నికల బరిలో నిలిచిన ఐదుగురు అభ్యర్థులు తమ ఓటు తాము కూడా వేసుకోకుండా త్యాగం చేశారు. 4వ డైరెక్టర్ స్థానంలో అడ్డగడ్ల మురళి కేవలం నాలుగు ఓట్లతో విజయం సాధించగా.. 7వ డైరెక్టర్ స్థానంలో వేముల సుక్కమ్మ 304 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. 12 డైరెక్టర్ స్థానాల్లో 61 మంది అభ్యర్థులు పోటీ పడగా ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో ఎన్నికల అధికారి టి.రామకృష్ణ గురువారం రాత్రి వెల్లడించారు.

1వ డివిజన్: రాపెల్లి లక్ష్మీనారాయణ 137, అరుకాల ఆనందం 4, గజ్జెల్లి సత్యనారాయణ–16, గుడ్ల వెంకటేశం–01, నల్ల ప్రదీప్–117, పత్తిపాక పద్మ–01, బొల్లి రవీందర్–01, యేముల మురళి–12.

2వ డివిజన్: గుడ్ల సత్యానందం–170, బోగ శంకర్–146, స్వర్గం శేఖర్–07.

3వ డివిజన్: చొప్పదండి ప్రమోద్–203, బొద్దుల భాస్కర్–154.

4వ డివిజన్: అడ్డగట్ల మురళి–190, యేముల హన్మంతు–06, సూరం వినయ్–186.

5వ డివిజన్: పాటి కుమార్‌రాజ్–188, తుంగ శివరాజ్–150, భానోత్ నీల–05, మొగిలి రాజు–04.

6వ డివిజన్: బుర్ర రాజు–218, ఆడెపు చక్రపాణి–05, కందికట్ల సదానందం–01, మర్రిపెల్లి శశికాంత్–01, మ్యాన రాంప్రసాద్–183, వంగరి అంబదాస్–01.

7వ డివిజన్: వేముల సుక్కమ్మ–334, ప్రయాకరావు వినీల–30, బుర్ర జ్యోతి–05.

8వ డివిజన్: అడ్డగట్ల దేవదాస్–205, అవధూత నాగరాజు–02, కూన లక్ష్మీనారాయణ–11, గోరిట్యాల ప్రకాశ్–97, గంగుల రాజేందర్–05, రాపెల్లి శ్రీహరి–02, స్వర్గం రాజు–72.

9వ డివిజన్: ఎనగందుల శంకర్–251, ఆడెపు జగదీశ్వర్–03, గాలిపెల్లి ప్రకాశ్–04, చొప్పదండి శ్రీనివాస్–13, నేరెళ్ల ప్రేమ్‌కుమార్–162, సోమిశెట్టి దశరథం–03.

10వ డివిజన్: వలుస హరిణి–151, ఆడెపు అనసూర్య–0, ఏలూరి కవిత–34, చీటి గీత–136, మచ్చ లలిత–111, మామిడాల లత–20.

11వ డివిజన్: పత్తిపాక సురేశ్–204, కట్ల సతీశ్–135, ఉల్పె శ్రీనివాస్–0, కోండి సదానందం–0, యెర్రగుంట కపిల్–136.

12వ డివిజన్: కోడం సంజీవ్–291, ఆడెపు సూర్య–172, అడిగొప్పుల పరమేశ్–0, కూస మహేశ్–06, గుడ్ల సురేశ్‌కుమార్–09, బూర్ల విద్యాసాగర్–01, మామిడాల రమణ–0.

'జీరో' బిల్లుల కోసం దరఖాస్తుల వెల్లువ



దరఖాస్తులు అందిస్తున్న వినియోగదారులు

గంభీరావుపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గృహ విద్యుత్, సబ్సిడీ గ్యాస్ కోసం దరఖాస్తులు చేసుకునేందుకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వినియోగదారులు బారులుతీరారు. మండలంలోని నాగంపేట, రాజేశ్వర్‌రావునగర్ కాలనీ, మల్లుపల్లి, పొన్నాలపల్లి, కోళ్లమద్ది, ముస్తఫానగర్, గోరింటాల, ముచ్చర్ల, గజసింగవరం, సముద్రలింగాపూర్ గ్రామాల పరిధిలోని వినియోగదారుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. గతంలో ప్రజాపాలనలో దరఖాస్తులు సమర్పించినప్పటికీ తమకు జీరో బిల్లు రావడం లేదని, సబ్సిడీ గ్యాస్ రావడం లేదని వినియోగదారులు మళ్లీ దరఖాస్తులు అందిస్తున్నారు. నిన్న మొన్నటిదాకా ఎన్నికల కోడ్ ఉన్నందున అధికారులు దరఖాస్తుల స్వీకరణ నిలిపేశారు. కాగా, శుక్రవారం కొత్తపల్లి, మల్లారెడ్డిపేట, దమ్మన్నపేట, ఈనెల 10,11 తేదీల్లో గంభీరావుపేట, జగదాంబతండా, 12న లింగన్నపేట, శ్రీగాధ, దేశాయిపేట, నర్మాల, రాజు పేట గ్రామాల వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్ పేర్కొన్నారు.

అక్రమ వడ్డీలతో అడ్డగోలు వసూళ్లు

- బస్వాపూర్‌లో ఓ పార్టీ నాయకుడి బరితెగింపు
- రోజుకోసారి వడ్డీ చెల్లించాల్సిందే..
- లేదంటే వస్తువులు జప్తుచేస్తున్న వైనం

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్‌లో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ నాయకుడు అక్రమ వడ్డీలతో గ్రామస్తుల నడ్డి విరుస్తూ అడ్డగోలుగా వసూళ్లు చేస్తున్నాడు. రోజు 10 శాతం, 20 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామానికి చెందిన సదరు ప్రతిపక్ష పార్టీ నాయకుడు ఎవరికైనా అప్పు కావాలంటే తక్షణమే స్పందిస్తాడు. రూ.5 వేలు అప్పుగా తీసుకుంటే రోజుకు రూ.500 వడ్డీ చెల్లించాల్సిందే. అవసరాన్ని బట్టి కొన్ని సందర్భాల్లో వడ్డీ రోజుకూ రూ.1000 కూడా ముక్కుపిండి వసూలు చేయడం అతనికి పరిపాటిగా మారింది. రూ.5వేలు, రూ.10వేలు అప్పు ఇచ్చేందుకు బాధితుల నుంచి సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాలు కుదువ పెట్టుకోవడం రోజుకోసారి వడ్డీ చెల్లించకపోతే వాటిని జప్తు చేయడం పరిపాటి. గ్రామానికి చెందిన ఓ బాధితుడు 'సాక్షి'కి ఫోన్‌చేసి తన గోడును వెళ్లబోసుకున్నాడు. రూ.3వేలు అప్పు తీసుకున్న పాపానికి తన రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాన్ని లాక్కున్నారని, డబ్బులు చెల్లించినా తిరిగి ఇవ్వడం లేదని వాపోయాడు. ఈ అక్రమ వడ్డీ వ్యాపారంపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక దృష్టిసారించి బాధితులకు న్యాయం చేయాలని, అక్రమ వడ్డీలతో నిరుపేదల నడ్డి విరిచే అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించరూ.!

రుద్రంగి: మండలకేంద్రంలోని 6వ వార్డు చర్చి ఆవరణలోని పలు కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేక మురుగునీరంతా రోడ్లపై పారుతోంది. ఇళ్లనుంచి బయటకు వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపై పారుతుండటంతో దోమలు వృద్ధి చెంది రోగాలబారిన పడుతున్నామని వాపోతున్నారు. మండలకేంద్రంలోని పలు కాలనీల్లోనూ ఇదే పరిస్థితి ఉందని గ్రామస్తులు తెలుపుతున్నారు. అప్పటి ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు రుద్రంగి గ్రామాన్ని దత్తత తీసుకొని చేసిందేమీ లేదని, ఇప్పుడున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టిసారించి గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 2004-2005లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని కొత్తపేట ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన అప్పటి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు.

అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లకు సన్మానం



కోడం సంజీవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో గెలుపొందిన డైరెక్టర్లను గురువారం బీఆర్ఎస్ మండల నాయకులు సన్మానించారు. బరిలో ఉన్న డైరెక్టర్లకు మద్దతుగా నాయకులు రెండు రోజులు సిరిసిల్ల పట్టణంలో విస్తృత ప్రచారం చేశారు. వారు మద్దతు తెలిపిన వారు గెలుపొందడంతో ఘనంగా సన్మానించి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి. సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, పిల్లి కిషన్ తదితరులున్నారు.